# తరాలు - అంతరాలు

1939

రామనాథంగారు ఇల్లు అదిరిపోయేలా పెద్దగా రంకెలేస్తున్నారు. ఎదురుగ్గా శారదాంబ భుజం నిండా పట్టుచీర కప్పుకొని తలుపు అవతల తల వంచుకు కూర్చున్నది.

పెంకుటింటి దూలాలకు వేలాడుతున్న కిరసనాయిల్ దీపాలు ఎర్రగా రామనాథంగారి కళ్ళలా మండిపోతున్నాయి.

పండిన జామపండులా వున్న ఆయన ఉయ్యాల బల్లమీద బిగదీసుకు కూర్చున్నాడు. పక్కన పదేళ్ళ చిన్న కొడుకు నిల్చొని తాటాకు విసనకర్రతో విసురుతున్నాడు.

"ఈ భ్రష్టుముండ ఇలాంటి తప్పుడు పనేదో చేస్తుందని నాకు తెలుసే... పింజారీ వెధవలూ... పింజారీ వేషాలు... మీ వంశమే అంత!"

"మధ్యలో నేనేం చేశానుష!" ఆమె భయం భయంగానే దీర్ఘం తీసింది.

సామాన్యంగా ఆమె భర్త ముందు నోరు విప్పదు. గుండెల్లో బాధో, ఆవేశమో, ఆనందమో పొగలు సెగలైనప్పుడు క్షణం తెరుస్తుంది.

"నిప్పేసి తగలెడతా... నిన్నూ, నీ కూతుర్నీ... సీమ దొరల దగ్గర పనిచేసిన వాడి కొడుక్కి నా కూతుర్ని ఇవ్వటమా... ఆ జాతి భ్రష్టుడు అక్కడ తప్పుడు పనులు చేయలేదనే నమ్మకమేమిటి?" రామనాథంగారు ఉయ్యాల బల్లమీద నుండి దూకుతున్నట్లుగా దిగాడు.

ఆయన దిగటం ఆలస్యం ఆమె చటుక్కున లేచి తలుపు పక్కగా నిలబడింది వణికిపోతూ.

"అది గనుక ఆ భ్రాష్టుడిని చేసుకుంటే- కృష్ణకెళ్ళి ఇద్దరికీ తిలోదకాలు వదిలి, పిండప్రదానం చేసివస్తా... ఆఁ..."

'ఈయన నోటికి ఎంత వస్తే అంత... ఏంవిటా అప్రాచ్యపు మాటలు... మా తమ్ముడు సీమదొర దగ్గర పని చేసినంత మాత్రానే భ్రష్టుడయ్యాడా?' ఆమె లోపల్లోపలే అనుకున్నది- పైకి అనే ధైర్యంలేక.

కూతురు జ్ఞానప్రసూనాంబ వడ్లబస్తాల గదిలో ఓ మూలగా కూర్చొని కుళ్ళి కుళ్ళి ఏడుస్తున్నది- తండ్రి రంకెలకు.

"ఆయనగారి నాయిన సీమదొరల దగ్గర పనిచేస్తే ఏమయిందిట... నేను బావనే చేసుకుంటా!" ఆమె ఏడుపులో రాగాలు ఆమాటలకు స్వరాల్లా వున్నాయి.

"అశనిపాతంలా మా నెత్తిన చుట్టుకున్న ఈ ఆపదనుండి మమ్మల్ని రక్షించు తల్లీ!" అన్నట్లుగా గుడ్డివెలుగులో తులసి చుట్టూ ప్రదక్షిణాలు చేస్తున్నది శారదాంబ.

సంవత్సరం తిరిగేలోగానే శారదాంబ ప్రార్థనలను గంగలో కలుపుతూ, జ్ఞానప్రసూనాంబ, ఆమె మనస్సులోని మాటలాగానే, ఇంటినుండి పారిపోయి బావనే పెళ్ళి చేసుకున్నది.

ఆ అవమానంతోటీ, దిగులుతోటీ ఆరునెలలు గడవకముందే ఆ ఇంటికప్పు కూలిపోయింది!

## 1969

సీతారామాంజనేయులు రెండు చేతులూ వెనక్కు పెట్టుకొని హాల్లో అటూ ఇటూ పచార్లు చేస్తున్నాడు.

ఆయన ముఖం నల్లగా వున్నది. అయన కళ్ళు తడిసి వున్నాయి. ఆయన శరీరాన్ని సన్నటి ఒణుకు ఊపుతోంది. అప్పుడు రాత్రి పదిగంటలయింది. ఆ ఇంటిని చుట్టివేసిన అవమానంలా చీకటి భయంకరంగా వున్నది.

"నలుగురిలో మనమెలా తలెత్తుకు తిరుగుతామే!" అన్నాడు జీరబోయిన గొంతుకతో భార్య జ్ఞానప్రసూనాంబ కళ్ళల్లోకి చూడలేక చూస్తూ.

ఆమె ఓ పక్కగా కుర్చీలో కూర్చొని వున్నది. ఏం చేయాలో తోచనట్లుగా భర్త ముఖంలోకే చూస్తున్నది గుడ్లనీరు కుక్కుకుంటూ.

"మీ నాయన సీమదొరల దగ్గర పనిచేసినందుకే మా నాన్న మనల్ని చీల్చి చెండాడి ఆ ఇంటి గడపగూడా తొక్క కుండా చేశాడు... ఇదేమో ఏకంగా ఇంకో కులంవాడినే

పెళ్ళి చేసేసుకుంది... ఏంవిటో ఖర్మ... ఏం చేయాలోగూడా అర్థమై చావటం లేదు... రేపు మనం గడపదాటి ఎలా బయటకు వెళ్ళాలో నాకు అర్థం కావటంలేదు!" ఆమె కళ్లు ఒత్తుకుంటూ అన్నది.

కొడుకు హాల్లో కాలుపెడుతూనే విసుగ్గా ఓసారి తల విదిలించి లైటు వేశాడు.

"ఏంవిటి చీకట్లో కూర్చున్నారు... ఉక్కపోసి చస్తుంటే ఫ్యానుగూడా వేసుకోలేదు... ఇంకా ఆలోచించి బుర్రలు పాడు చేసుకునేదేమున్నది... కాగితం రాసిపెట్టి వెళ్ళింది గదా- చదువుకొని సంతోషించమని!" అన్నాడు అరుస్తున్నట్లుగా.

"మాకేం చేయాలో అర్థం కావడంలేదురా నాయినా... మా అమ్మ ఎలాంటిది... ఊళ్ళో ఎంత గౌరవం... దేవతను చూచినట్లు చూచేవాళ్ళు జనమంతా... అలాంటి ఆమె పేరే పెట్టాను దీనికి శారద అని- భ్రష్టుముండ- మన ముఖాల మీదే ఇంత బురద జల్లి- మన పరువు గంగలో కలిపి లేచిపోయింది గదరా!" ఆమెకు ఏడుపు ఆగటం లేదు. చీర చెంగును నోట్లో కుక్కుకుంటున్నట్లుగా నోటికేసి ఒత్తుకోసాగింది.

కొడుకు తండ్రి దగ్గరకు వచ్చి నిలబడ్డాడు.

"నాన్నా! పెద్దవాడివి... అమ్మకు ధైర్యం చెప్పవలసినవాడివి... నువ్వే ఇలా దిగులుపడిపోతే ఎలా?" అన్నాడు అనునయంగా.

"ఏ గుండెల మీదగా అయితే మోసి పెంచానో ఆ గుండెలనే ఒక్క తన్ను తన్ని వెళ్ళిపోయిందిరా!" అంటూ ఏడ్చేశాడు ఆయన.

కొడుకు రంగనాథం తండ్రి చేయిపట్టుకున్నాడు. చిన్నగా తీసుకు వెళ్ళి వాలుకుర్చీలో కూర్చోబెట్టాడు. నాలుగు నిముషాలు ఆయనలోని బాధంతా కన్నీరు రూపంలో బహిర్గతం అయిందాకా ఆయన పక్కనే చిన్న స్టూలు మీద ఆయనకు ధైర్యం చెబుతున్నట్లుగా కూర్చున్నాడు.

కండువాతో కళ్ళు అద్దుకున్నాడు తండ్రి.

రంగనాథం అప్పుడు నోరు విప్పాడు- "ఎవరి బ్రతుక్కు ఎవరు బాధ్యులు నాన్నా! మరొకరి బ్రతుకుని శాసించే హక్కు మనకు లేదు. మీరు దాన్ని కన్నతండ్రిగా- అది ఎక్కడున్నా సుఖపడాలనే కోరుకోండి... ఆ మీ కోరికే దానికి ఆశీస్సు అవుతుంది... అది సుఖంగా బ్రతుకుతుంది!"

'అంతేనంటావా?' అన్నట్లుగా ఉన్నాయి ఆ తల్లిదండ్రుల చూపులు.

'అంతే' అన్నట్లుగా ఒక్కసారి తల ఊపి లోపలకు వెళ్ళాడు కొడుకు.

1999

రంగనాథం మౌనంగా కూర్చున్నాడు. భార్య నిర్మల ఆయన పక్కన ఆయన కూర్చున్న కుర్చీమీద చేయి వేసి నిల్చున్నది. దూరంగా ఓ పక్కగా కూతురు ప్రసూన తల వంచుకు నిల్చొని కిటికీలోనుంచి బయటకు చూస్తున్నది. సాయంత్రం ఆరుగంటలయింది. చలికాలపు చీకటి అప్పుడే దీపాలు వెలిగించేసింది.

అంతా నిశ్శబ్దం.

ముందు రంగనాథమే నోరు విప్పాడు. "సరే కానీయ్... ఏం చేస్తాం... అనుకుంటే నలుగురూ నాలుగు రోజులు అనుకుంటారు... ఆపైన ఎవడికి పట్టిందట మన సంగతి!" అన్నాడు.

నిర్మల మాట్లాడకుండా నిల్చున్నది కూతురువంక చికాగ్గా చూస్తూ.

ప్రసూన మెడ తిప్పి తండ్రినే చూస్తూ, "మన కులంకాని మాట నిజమేకాని... అతడిలో ఒక్క చెడ్డ గుణంగూడా లేదునాన్నా! కనీసం సిగరెట్టు గూడా త్రాగడు... కాలేజీ ర్యాంకుల్లో ఎప్పుడూ మొదటి పదిమందిలోనే వుంటాడు... నాకంటే ఒక సంవత్సరం సీనియర్!" అన్నది.

"అవునులే మనకిష్టమయితే అన్నీ బంగారు గుళికలే!" తల్లి ఎకసెక్కంగా అన్నది.

రోషంగా చూచింది తల్లివంక ప్రసూన.

రంగనాథం చిన్నగా నవ్వాడు.

"నిర్మలా పోనీయ్! మనమ్మాయిన ఒకందుకు మెచ్చుకోవాలి... వాళ్ళత్తయ్య లాగా ఇంట్లో ఓ చీటీ పెట్టి పారిపోలేదు!" అన్నాడు.

"అవునులే మేనత్త పోలిక... ఎక్కడికి పోతయి లక్షణాలు!" విసురుగా వెళ్ళి చెమట పోస్తున్నట్లనిపించగా కూలర్ ఆన్‌చేసింది.

"తల్లిగదా అలాగే కొన్నాళ్ళు బాధపడుతుంది... అది సహజం... నువ్వు కోపగించుకోబోకురా... మీరు సుఖంగా వుండటమే మాకు కావాల్సింది... నీ మనస్సుకు నచ్చింది ధైర్యంగా చేశావ్... మేం బాధపడ్డా, సంతోషపడ్డా నీ అందమైన భవిష్యత్తు కోసమేగదా!" అనునయంగా అన్నాడు తండ్రి.

నిర్మల తండ్రీ కూతుళ్ళను చూస్తూ మూతి తిప్పింది వంకరగా. "సంబడమే!"

"సారీ నాన్నా! మీ మనస్సుకు కష్టం కలిగిస్తే నన్ను క్షమించండి నాన్నా! మీ ఇద్దరి ఆశీస్సులూ లేందే మేం జీవితంలో ఒక్క అడుగు గూడా ముందుకు సుఖంగా వేయలేం!" అన్నది తడుస్తున్న కళ్ళతో తల్లిదండ్రులను చూస్తూ ప్రసూన.

"ఛ! పిచ్చికన్నా... బాధపడబోకు... అన్నీ ఆనందంగానే జరిగిపోతయి... చెప్పు అతడెక్కడున్నాడు... నేను వెళ్ళి తీసుకు వస్తాను... మీ ఫ్రెండ్సందరికీ పార్టీ ఎప్పుడు ఎరేంజ్ చేద్దామంటావ్?"

ప్రసూన కళ్ళు ఆనందంతో తళుక్కుమన్నాయి.

"పై రెండు గదులూ ఖాళీగానే వున్నాయి గదా... అతడు ఏదైనా ఉద్యోగంలో జేరేటంతవరకూ మీరు అందులోనే ఉండండి!" అన్నాడు ఆమె భవిష్యత్తుకు గట్టి పునాది వేస్తున్నట్లుగా.

"థాంక్యూ... థాంక్యూ నాన్నా!"

2029

"హాయ్! మమ్మీ, డాడీ, గ్రాండ్ మా... ఐ యామ్ మ్యారీడ్! అంటే నేను పెళ్ళి చేసుకున్నానోచ్!" శారూ కారు దిగి లోపలకు వస్తూనే అన్నది.

"ఎవరే శారూ అతడు?" తల్లి అడిగింది.

"మా కొలీగ్ మమ్మీ! విలియమ్స్ అని... ఏ నైస్ బాయ్... జెంటిల్మన్!" అన్నది కళ్ళు పెద్దవి చేసి ఆనందంగా చూస్తూ.

వెనగ్గా విలియమ్స్ లోపలకు వస్తున్నాడు.

"సరి! మన మతం గూడా కాదన్నమాట... రోజులెలా మారిపోతున్నయ్యో!" బామ్మ బోసినోటిని చేత్తో సగం మూసుకొని గొణిగింది.

"విల్లీ! కమాన్... నా బెడ్ రూంలోకి వెళ్ళి రెస్ట్ తీసుకుందువుగాని పద... డైనింగ్ టేబుల్ దగ్గర మా వాళ్ళనందరినీ నీకు ఇంట్రడ్యూస్ చేస్తానులే!" అంటూ అతడిని చేయి పట్టుకొని తన రూంలోకి తీసుకు వెళ్ళి బయటకు వచ్చింది.

"ఏం పని తల్లీ ఇది!" అన్నాడు తండ్రి.

"ఏమటి డాడీ... గ్రాండ్‌మా, మమ్మీలాగానే నువ్వూ మహాచాదస్తంగా మాట్లాడేస్తున్నావ్... ఏంవిటి ఏసీగూడా ఆన్ చేయలేదు!" అంటూ ఆమె వడివడిగా కిటికీ దగ్గరకు వెళ్ళి ఏసీ ఆన్‌చేసింది.

"అదికాదమ్మా!" తండ్రి దీర్ఘం తీశాడు. "మాతో ముందు చెబితే..."

"ఏం... ఏమైంది... ఊరికినే నసగొద్దు... నేను చేసిన పని బాగాలేదనుకున్న వాళ్ళు ఇంట్లోనుంచి బయటకు వెళ్ళిపోవచ్చు... అంతేగాని ఇక్కడ వుండి మమ్మల్ని సతాయించవద్దు!" అన్నది విసురుగా.

"అట్లా కాదమ్మా... వాళ్ళ మతం వేరు... మన మతం వేరు... వాళ్ళ అలవాట్లు వేరు... మన అలవాట్లు వేరు ... వాళ్ళ ఆచారాలు వేరు... మన ఆచారాలు వేరు... అందువలన మనస్పర్థలు రావచ్చు!"

"నో డాడీ... నో... ఎలాంటి మనస్పర్థలూ రావు... ఇద్దరం ఒకళ్ళనొకళ్ళం అర్థం చేసుకునే ఈ మ్యారేజ్ చేసుకున్నాం ... లేదూ... నువ్వన్నట్లు వచ్చినయ్యా... విడాకులు తీసుకుంటాం... ఇంత చిన్నదానికి ఎందుకు వర్రీ అవ్వటం... దెన్ వుయ్ ఆర్ ఫ్రీ బర్డ్స్... ఫ్రీ బర్డ్స్... ఫ్రీ... ఫ్రీ... బర్డ్స్!" ఇంగ్లీషు పాటలా పాడుతూ డాన్స్ చేయసాగింది శారూ.

తల్లి అక్కడనుంచి లేచి వెళ్ళబోయింది.

శారు, "అవును మమ్మీ వంటయిందా... విల్లీ, నేనూ పొద్దుటినుంచి ఏమీ తినలేదు... వంటయితే లంచ్ ఎరేంజ్ చేయ్... లేదంటావా హాట్‌హాట్‌గా ఏదైనా టిఫిన్ చేసి పెట్టేసేయ్!" అన్నది.

తల్లి వంటయింట్లోకి వెళ్ళింది.

శారు తండ్రి ఎదురుగ్గా వచ్చి ఆయన కూర్చున్న సోఫా చేతుల మీద తన చేతులు వేసి ముందుకు వంగి, "డాడీ... నెక్స్‌ట్ వీక్ హనీమూన్‌కు సింగపూర్ వెళ్దాం అని ప్లాన్ చేస్తున్నాం... యాభైవేలు రెడీచేసి అట్టిపెట్టు... ఓకే!" అంటూనే తన రూంలోకి వెళ్ళిపోయింది.

* * *

*(స్వాతి: మాసపత్రిక: ఏప్రియల్, 1999)*